క్లుప్తంగా

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: మండలంలోని మాకవరం గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీ విధానంపై ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ గురువారం అవగాహన కల్పించారు. జిల్లేడు ద్రావణాన్ని వినియోగించడం వల్ల వరి పంటలో రసం పీల్చే, కాండం తొలుచు పురుగులను నివారించవచ్చన్నారు. సర్పంచ్ గార భాస్కరరావు ఆధ్వర్యంలో 200 లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు. ప్రతీ రైతు జిల్లేడు ద్రావణాన్ని తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ధనలక్ష్మి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జేఎస్‌సీ సమావేశం

జలుమూరు: చల్లవానిపేట పద్మలయ కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం జగనన్న సచివాలయ కన్వీనర్ల (జేఎస్‌సీ)తో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ వాన గోపి, మండల సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, బీసీ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య హాజరవుతారన్నారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

పాతపట్నం: ఈ నెల 6న మండలంలోని ప్రహరాజపాలెంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) స్టేషన్ వద్ద వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను వేలం వేయనున్నారు. ఈ మేరకు ఎస్‌ఈబీ సీఐ వై.లక్ష్మునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 గంటలకు ఆధార్ జిరాక్స్‌తోపాటు రూ.1000 ముందస్తుగా చెల్లించాలన్నారు. వేలంపాట 10:30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు గురువారం తెలిపారు. లెవెన్ కేవీ కిల్లాం ఫీడర్‌లో మరమ్మతు పనులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. దేవాది, మాకివలస, రావులవలస, శ్రీరాంపురం, లకిమేరతో పాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అల్లాడ మాజీ సర్పంచ్ మృతికి పలువురి సంతాపం



సూర్యారావు (ఫైల్)

జలుమూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, అల్లాడ మాజీ సర్పంచ్ మొజ్జాడ సూర్యారావు (90) గురువారం రాత్రి స్వగ్రామం అల్లాడలో మృతి చెందారు. ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇంటి వద్దే చికిత్స పొందుతున్నారు. ఇతనికి కుమారులు శ్యామలరావు, ఆటకేశ్వరరావు, రాముకుమార్, కుమార్తె నాగమణి ఉన్నారు. శ్యామలరావు ప్రస్తుతం అల్లాడ పీఏసీఎస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈయన మృతి పట్ల ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, జలుమూరు ఎంపీపీ వాన గోపి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

జీవన ఎరువుల వినియోగంతో భూసారం



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కొత్తూరు: జీవన ఎరువులను వినియోగించి భూసారం కాపాడుకోవచ్చని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి అన్నారు. మండలంలోని అడ్డంగి గిరిజన గ్రామంలో గురువారం జీవన ఎరువులు, సమతుల్య, పౌష్టికాహారాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అజులా వంటి జీవన ఎరువులు వినియోగించడం వల్ల భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సునీత వివరించారు. గొట్టిపల్లి సచివాలయం వ్యవసాయ సహాయకురాలు శ్రీలక్ష్మి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: మిరియాపల్లిలో పౌష్టికాహార ప్రదర్శనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఐసీడీఎస్ సిబ్బంది



సారవకోట: కిన్నెరవాడలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన



పోలాకి: చెల్లాయివలసలో మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య



సరుబుజ్జిలి: కొండవలసలో మందులు పంపిణీ చేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

ఆరోగ్య ఆంధ్రప్రదేశే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. నరసన్నపేట, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు వచ్చిన రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ప్రజలకు ఆరోగ్య భరోసానిచ్చే ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు.

-సాక్షి నెట్‌వర్క్

గ్రామంలోనే వైద్య సేవలు



ప్రజల ఆరోగ్యం కోసం ఇంత శ్రద్ధ చూపుతున్న ముఖ్యమంత్రిని మొదటిసారి చూస్తున్నాం. ఆరోగ్య శిబిరంలో జిల్లా నుంచి స్పెషలిస్ట్ వైద్యులు రావడం గొప్ప విషయం. శిబిరంలో ఈసీజీలు, రక్త పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి జిల్లా ఆస్పత్రులకు ఉచిత వైద్యం కోసం రిఫర్ చేస్తున్నారు.

– సతివాడ వరలక్ష్మి, కొండవలస, సరుబుజ్జిలి మండలం



ఆమదాలవలస రూరల్: చిట్టివలసలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



సరుబుజ్జిలి: కొండవలసలో పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



హిరమండలం: ధనుపురంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి



నరసన్నపేట: తామరాపల్లిలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనురాధ



బూర్జ: ఏపీపేటలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



సారవకోట: కిన్నెరవాడలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



కొత్తూరు: సోమరాజపురంలో కంటి వైద్య విభాగాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పొందూరు: కృష్ణాపురం రోగులకు మందులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జలుమూరు: మర్రివలసలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న గ్రామస్తులు



బూర్జ: ఏపీపేటలో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు క్యూలో ఉన్న గ్రామస్తులు



మెళియాపుట్టి: పెద్దపద్మాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైఎస్సార్‌సీపీదే విజయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

• ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చల్లబంద వద్ద ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు అధ్యక్షతన గురువారం జరిగిన 'ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇది పేదల పక్షపాత ప్రభుత్వమన్నారు. అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. గ్రామ వలంటీర్లు, గృహసారథులు మరోసారి ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి సీఎం జగన్ నాయకత్వ అవసరాన్ని తెలియజేయాలన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ కణితి సత్తిబాబుకు పార్టీ సమాచారం వేగవంతం నిమిత్తం ఎమ్మెల్యే మొబైల్‌ను అందజేశారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, రాష్ట్ర నృత్య అకాడమీ డైరెక్టర్ లండ యర్రయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధితో వలసల నివారణ

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టడం వల్ల వలసలు నివారించవచ్చని కట్యాచార్యులపేట సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అన్నారు. గ్రామంలో అభివృద్ధి ప్రణాళికపై గురువారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, నీటి యాజమాన్యం, మంచినీటి చెరువుల అభివృద్ధి వంటి పనులపై ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి సాధించే విధంగా ఉపాధి పనులను గుర్తించాలని సూచించారు. ఉపాధి వేతనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమారరాజు

మెళియాపుట్టి: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానంతో పాటుగా మానసిక వృద్ధిని సొంతం చేసుకోవచ్చని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార రాజు అన్నారు. మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు.

పలు పుస్తకాలను, నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదవాలన్నారు. పిల్లలు, పెద్దలు అందరూ చదివే పుస్తకాలు, మహనీయులు అందించిన అద్భుత రచనలు అందుబాటులో ఉంటాయన్నారు. అవసరమైన పుస్తకాల కోసం ఇండెంట్ పెట్టుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి అనురాధ ఉన్నారు.

ఎస్సీ సెల్ నాయకుడిపై దాడి

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు ముచ్చ గణేష్‌పై నరసన్నపేట ప్రశాంతినగర్‌కు చెందిన కరుకోల దేవానంద్ బుధవారం రాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ దాడిలో గణేష్‌తో పాటు గాయపడిన మరో వ్యక్తి అలిగి శాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముచ్చ గణేష్‌తోపాటు అలిగి శాంతారావు పోలాకి రోడ్డులో ద్విచక్ర వాహనం నిలిపి.. పక్కన నిల్చొని మాట్లాడుతున్నారు. వెనుక నుంచి కరుకోల దేవానంద్ తన ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టాడు. దీంతో వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దేవానంద్ తన చేతిలో ఉన్న బీరు బాటిల్‌తో గణేష్, శాంతారావులపై దాడికి పాల్పడ్డాడు. గణేష్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. శాంతారావుకు స్వల్పగాయాలయ్యాయి. గణేష్‌ను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఎమ్మెల్యే కృష్ణదాస్ పరామర్శ..

శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్న ముచ్చ గణేష్‌ను నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య గురువారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. గణేష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి తదితరులు ఉన్నారు.



గణేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావును లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్, దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కె.మిత్రో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముగడ దివాకర్, ఉప సర్పంచ్ అశోక్ పాణిగ్రాహి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

సారవకోట: ఉపాధ్యాయ వృత్తి గొప్పదని టెక్కలి డివిజన్ డిప్యూటీ ఈఓ గార పగడాలమ్మ అన్నారు. మండలంలోని జేబీటీ పాఠశాలలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈఓలు ఎం.వి.రమణ, భూలక్ష్మి, పాఠశాల డైరెక్టర్ మోహనగాంధీ ఉన్నారు.



ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను సత్కరించిన మిత్రో, అధ్యాపకులు



సారవకోట: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డిప్యూటీ ఈఓ, ఎంఈఓలు

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలు తొలగింపు పనులు చేపట్టిన ఆర్‌అండ్‌బీ అధికారులు

ఎల్.ఎన్.పేట: హిరమండలం మండలం గొట్టా బ్యారేజ్ నుంచి శ్రీముఖలింగం వెళ్లే సింగిల్ లైన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, రెల్లి పొదలను ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు తొలగించారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం హిరమండలం మండలంలోని పిండ్రువాడలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. ఎదురుగా వస్తున్న వాహనం గుర్తించలేని పరిస్థితి ఉండటంతో పిచ్చి మొక్కలు తక్షణమే తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ ఏఈ బి.గోపాల్, రాజశేఖర్ గురువారం పిచ్చి మొక్కలు తొలగింపు పనులు చేపట్టారు. గొట్టాబ్యారేజ్ నుంచి భగీరథపురం, అంబావల్లి, అక్కరాపల్లి, రెల్లివలస గ్రామాల వరకు పిచ్చి మొక్కలు తొలగింపు పనులు చేపడతామని ఏఈ తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, రామారావు తదితులు పాల్గొన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

సారవకోట: చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్దేశించిన సిలబస్ మేరకు పాఠ్యాంశాలను పూర్తిచేయాలని టెక్కలి డివిజన్ డిప్యూటీ ఈఓ గార పగడాలమ్మ అన్నారు. మండలంలోని తొగిరి, చీడిపూడి, లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. విద్యార్థులలో పఠనాసక్తి పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన వర్క్‌బుక్స్ విద్యార్థులతో పూర్తిచేయించాలన్నారు. ఎంఈఓలు రమణ, భూలక్ష్మి పాల్గొన్నారు.



తొగిరిలో విద్యా ప్రమాణాలు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ

మహిళా సంఘాల సభ్యులకు వ్యక్తిగత రుణాలు

• డీఆర్‌డీఏ పీడీ బీవీ విద్యాసాగర్

సారవకోట: ఇదివరకు కంటే ఎక్కువగా మహిళా సంఘాలకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నాయని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ బీవీ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని ఎంఎంఎస్ కార్యాలయంలో వీఓఏలతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో బ్యాంకులు మహిళా సంఘాలకు రుణాలిచ్చేందుకు ఆసక్తి చూపించేవి కాదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. పొదుపు సంఘాలు వారి సంఘాల పొదుపు నుంచి రుణం తీసుకునేందుకు అధిక ప్రాముఖ్యత ఇచ్చేలా వీఓఏలు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో సంఘాలకు చేయూత, ఆసరా, సున్నా వడ్డీ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆటో, టెంపోల కోసం వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. సారవకోట ఎంఎంఎస్ అన్ని రంగాలలో సంతృప్తికరంగా ఉందని కితాబిచ్చారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

తపాలా సేవలపై అవగాహన

బూర్జ: బ్యాంకు సేవలకు దీటుగా తపాలా సేవలు విస్తృతమయ్యాయని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. మండలంలోని ఓవిపేటలో గురువారం తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. తపాలాశాఖ సేవలు ప్రజలకు వివరించారు. గ్రామంలోని వృద్ధులు, ఉత్తమ వినియోగదారులను సన్మానించారు. తపాలాశాఖ సిబ్బంది, స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇసాయి వెంకటరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పొందూరు: క్యూటరీ, క్రిమినల్, ఇతర పిటిషన్లపై స్టాంపులను అతికించాలని ఏపీ బార్ కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని నిరసిస్తూ గురువారం పొందూరు సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా రాజాం బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.మంజుల మాట్లాడుతూ ప్రతి పిటిషన్‌పై అతికించాల్సిన స్టాంపు మొత్తాన్ని పెంచడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బ్రహ్మాజీ, రంగారావు, అశోక్, రామ్మోహన్, రాము, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.